

# అభ్యంతరం

— రుక్మిణి

పెండ్లిపందిట్లో బాజాలు అట్టహాసంగా మ్రోగుతున్నాయి ... పిల్లలూ, పెద్దలూ ... హడావుడిగా అటూయిటూ తిరుగుతున్నారు ... అందరిలోకీ అనసూయ అందరినీ ఆకర్షిస్తూంది ... చలాకీగా ... రివ్వురివ్వుమని ఆ మూలనుండి యీ మూలకు రెండుజడలతో తిరుగుతూంది. చాలామంది కండ్లు అనసూయ వేపే కండ్లప్పగించి చూసి, అందని ద్రాక్ష పండ్లు అనుకుని లోలోన గొణుక్కొని, చూడడం మానేశాయి

ఆ దినం సాయంత్రంవరకు, అనసూయ దృష్టి రామారావుమీద పడింది. అలా దృష్టిపడడానికి రామారావు ప్రత్యేకంగా చేసిన ప్రయత్న మేమీలేదు ... విడిదిలో ఓ మూల కూర్చుని పేపర్లో పడిన తన కథను చూసుకుని మిగతా కథలతో పోల్చుకుంటున్నాడు ... అనసూయ, ఎంతైనా కాలేజీలో బి. ఏ. చదువుతోంది కనుక, లజ్జ, భిడియం అనే పదాలను తనకు సాధ్యమైనంత దూరంలో ఉంచుకుంది.

"మీ పేరు ..."

"రామారావు" ... సంకోచం లేని సమాధానం, తలయెత్తి చెప్పిన విధానం, చూసిన చూపు అనసూయను యింకా ఆకర్షించాయి.

"నా పేరు అనసూయ ... బి. ఏ. ఫైనలియరు చదువుతున్నాను"... క్రీగంట రామారావును చూస్తూ స్వగతంతో అన్నట్టు అంది.

"వెరీగుడ్ ... బి. ఏ. అన్నమాట."

"అవును"... మా నాన్నగారు ఫలానా అని చెప్పింది ... రామారావు సంతోషించాడు ... అనసూయ, రామారావు అందమైన కనులవంక చూస్తూ యింకా చొరవ తీసుకుంది.

"కాలేజీలో ... 'సాంగ్స్ కాంపిటీషన్స్'లో చాలాసార్లు ప్రైజు తీసుకున్నాను"...యింకా తనకు గల అభిరుచులను పూసగుచ్చినట్లు చెప్పింది.

రామారావు చాలా విధాలుగా ఆమె అభిరుచులను అభినందించాడు.



"నేను అందంగా లేనా"...ప్రక్కకు చూస్తూ అడిగింది.

"ఓ... మీ కేం ... బ్రహ్మాండంగా ఉన్నారు"...రామారావు ఎంతైనా చిన్న రచయిత కాబట్టి, తనకు తోచిన మాటలలో ఓ పావుగంట అనసూయ అందాన్ని పొగిడాడు.

"నేను మా నాన్నకు ఒక్కర్తినే అమ్మాయిని...వెనకా, ముందూ ఎవరూ లేరు" ... ఆశగొలుపుతూ అంది అనసూయ.

"ఇంకేం...ఎవరో అదృష్టవంతుడు ప్రపంచంలో పెట్టిపుట్టా డన్నమాటే." రామారావు ఉత్సాహంగా అన్నాడు.

"ఆ అదృష్టవంతులు మీరే ఎందుకు కాకూడదు" ... 'ఆలస్యం అమృతం విషం' వంటి సామెత నిజం కావచ్చు నన్న ఆదుర్దాతో అనసూయ తనమనసులోని మాట బైటపెట్టింది.

"అంటే" ...రామారావు అర్థంగాక అడిగాడు.

"మీరు ఎం. ఏ. చదివారు ... నేను బి. ఏ. చదువుతున్నాను ... మనయిద్దరి కులాలూ...శాఖలూ...ఒకటి. అందులోకీ మీరు నాకు బాగా నచ్చారు...మీరు నన్ను పెండ్లిచేసుకోవడానికి మీ కేమిటి అభ్యంతరం.

"అబ్బే...అబ్బే...నా కేమీ అభ్యంతరంలేదు...ఒక్కసారి మా ఆవిడను కూడా అడిగిచూస్తే మంచిదేమో !

అనసూయ తెల్లమొగం వేసింది ... పందిట్లో బాజాలు తిరిగి మ్రోగడం మొదలెట్టాయి. ★